పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

- పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన
- రాస్తారోకో, దిష్టిబొమ్మ దహనం

బనగానపల్లెరూరల్: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని గ్రామ, వార్డు వలంటీర్లపై తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం బనగానపల్లె పట్టణంలో వలంటీర్లు రాస్తారోకో నిర్వహించారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ముందుగా మండల వ్యాప్తంగా ఉన్న వలంటీర్లు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం చేరుకొని అక్కడి నుంచి, పవన్ కల్యాణ్ గ్రామ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ, పవన్ కల్యాణ్ ముర్దాబాద్ అంటూ హాస్పిటల్ రోడ్డు మీదుగా పెట్రోల్ బంకు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ పవన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టడంతో పాటు పెట్రోల్ పోసి దహనం చేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ఎంతో సేవా భావంతో పనిచేస్తున్న వలంటీర్లను పవన్ తన రాజకీయ స్వార్థం కోసం కించపరచి విధంగా మాట్లాడడం ఆయన వ్యక్తిత్వానికి తగదన్నారు. గతంలో ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ తీవ్రంగా ఉన్న సమయంలో వలంటీర్లు ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు.


బనగానపల్లెలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఖండన

కోవెలకుంట్ల: గ్రామ వలంటర్ వ్యవస్థపై జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రామ సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన వలంటీర్లు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ రూ. 5 వేల గౌరవ వేతనంతో విశిష్ట సేవలందిస్తున్నారన్నారు. ప్రతి నెల 1వ తేదీన తెల్లవారకముందే ఇళ్లవద్దకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారని చెప్పారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వ్యవస్థపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


డోన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

పవన్ వ్యాఖ్యలపై నిరసన

డోన్ టౌన్: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు సోమవారం పట్టణంలోని 16వ సచివాలయ కన్వీనర్ పడే రంగస్వామి ఆధ్వర్యంలో వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ నోరు పారేసుకోవడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. తెల్లారక ముందే ప్రభుత్వ పింఛన్లు అందజేయడం, అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలను వర్తింప జేయడంతో ఓర్వలేక అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్యాకేజీ కల్యాణ్ అని నిరూపించుకున్నారు



జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్యాకేజీ కల్యాణ్ అని తన మాటల ద్వారా మరోసారి నిరూపించుకున్నారు. కరోనా కష్ట కాలంలో పవన్ కల్యాణ్‌తో పాటు ఎంతో మంది ప్రముఖులు ఎక్కడికక్కడే తలదాచుకున్నారన్నారు. అలాంటి సమయంలో కూడా వలంటీర్లు తమ ప్రాణాలను సహితం లెక్క చేయకుండా ఎన్నో కుటుంబాలకు ఎంతో సేవ చేశాం. ఆయన వలంటీర్లపై అనుచితవ్యాఖ్యలు చేయడం బాధాకరం. ఆయన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి. – ఇద్రూస్‌బాషా, హుస్సేనాపురం వలంటీర్

చంద్రబాబు అడుగుజాడల్లోనే పవన్



గతంలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు వలంటీర్లను గోనె సంచులు మోసేవాళ్లు, దిన్నపూరోడు, పెద్దపాలెరుగాళ్లు అని వ్యంగ్యంగా మాట్లాడి కించపరిచారు. బాబుగారి అడుగుజాడల్లోనే పవన్ కల్యాణ్ నడుస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులా ఉంటూ పార్టీ, కులమతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హత కలిగినవారికి అందిస్తున్నాం. వలంటీర్ల సేవలంటే ఏంటో గ్రామాల్లోకి వచ్చి అవ్వాతాతలను, అక్క చెల్లెమ్మలను, దివ్యాంగులను అడుగు తెలుస్తుంది. వలంటీర్ల వ్యవస్థపై లేని వ్యాఖ్యలను మంది పేరు పవన్ కల్యాణ్ వ్యవస్థలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌కు తగిందిదారు. – రజియా బనగానపల్లె–2 వలంటీర్

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు పూర్తి


ఓ కాలనీలో పూర్తయిన సీసీ రోడ్డు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలోని పలు కాలనీల్లో చేస్తున్న సిమెంట్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. చాలా రోజుల నుంచి కాలనీల్లో సిమెంట్ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కేపీ రామ్మోహన్‌రెడ్డి సమస్యలను అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కంపెనీ సామాజిక బాధ్యత కింద సీఎస్‌ఆర్ నిధులు మంజూరు చేయడంతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. రోడ్లు ఏర్పాటు కావడంతో ఆయా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ కార్యదర్శులకు ట్యాబ్‌ల పంపిణీ


సచివాలయ కార్యదర్శులకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

డోన్: పట్టణంలో ఆస్తుల మదింపు కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాంగ్స్ గెలాక్సీ ట్యాబ్‌లను సోమవారం మునిసిపల్ ఛైర్మన్ సప్తగిరి రాజేష్, కమిషనర్ వెంకట్రామిరెడ్డిలు సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఆస్తుల రీసర్వే కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఎలాంటి వివక్షత, ఆరోపణలకు తావులేకుండా సత్వరమే రీసర్వే పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీపీఓ నాగరాజు, టీపీఎస్ అంజాన్‌బాషా తో పాటు పట్టణంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం


ఆటోలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

కోవెలకుంట్ల: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అన్నివిధాలా సురక్షితమని డిపో ఎస్‌టీఐ కిషోర్ సూచించారు. స్థానిక జమ్మలమడుగు రోడ్డులో సోమవారం ఆటోల్లో ప్రయాణ నియంత్రణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమన్నారు. డిపో పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లిన ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో డిపో డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏడీసీ వెంకటపతి, ఎస్‌ఎం యూ జిల్లా సెక్రటరీ శివరాం, ఎస్‌ఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిపో అధ్యక్షులు నరసింహులు, గిరి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభకనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న గుండం నాగేశ్వరరెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు నేషనల్ లెవల్ ఛాంపియన్ షిప్ కరాటే పోటీల్లో పాల్గొని గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించినట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన సంఘం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లెవల్ కరాటే ఛాంపియన్ పోటీల్లో విద్యార్థులు నాగేంద్రప్రసాద్, సిద్ధార్థగౌడ్‌లు గోల్డ్, శశాంక్, వేణులు సిల్వర్ పతకాలు సాధించారన్నారు. ఈ మేరకు పతకాలు సాధించిన విద్యార్థులను అందుకు కృషి చేసిన కరాటే మాస్టర్ చంద్రను గుండం నాగేశ్వరరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ ఉపసర్పంచ్ శివకృష్ణ, సుధాకర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

రెడ్డి సంఘం యువజన అధ్యక్షుడి నియామకం

నంద్యాల(అర్బన్): రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా పుట్టగూర వెంకటప్రదీప్‌రెడ్డిని నియమిస్తూ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా నియమించిన సురేంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పంట పొలాలను చెరువులో కలపొద్దు

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉడుములపాడు చెరువు పరిధిలో సాగులో ఉన్న పంట పొలాలను అభివృద్ధి పేరుతో చెరువులో కలపొద్దని కొంత మంది రైతులు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటరెడ్డికి వినతి పత్రం అందించారు. కొన్ని దశాబ్దాలుగా పంటలు సాగు చేసుకుంటున్న పొలాలను చెరువులో కలిపితే జీవనాధారం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు


బనగానపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

బనగానపల్లెరూరల్: బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు వారి డిమాండ్ల సాధనలో భాగంగా సోమవారం ధర్నాకు వెళ్లారు. ప్రాజెక్టు పరిధి ఉన్న అంగన్‌వాడీ సెంటర్లు తెరుచుకోకపోవడంతో చిన్నారులు, గర్భిణి, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ జరగలేదు. ధర్నా విషయం తెలియని చాలా మంది లబ్ధిదారులు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆయా కేంద్రాలకు వచ్చి తిరిగి వెళ్లారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మను వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రాలు మూసి వేసిన విషయం వాస్తవమేనన్నారు. సెంటర్లలోని అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు వారి డిమాండ్ల సాధనలో భాగంగా రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్త ధర్నాకు వెళ్లినట్లు తెలిపిందని, వారు స్పందనగా తమకు ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వలేదన్నారు.

నేరేడుచెర్లలో కేడీసీసీ బ్యాంకు శాఖ

ప్యాపిలి: మండల పరిధిలోని నేరేడుచెర్ల గ్రామానికి కేడీసీసీ బ్యాంకు శాఖ ఏర్పాటు కానుంది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ నెల 8న జరిగిన సమావేశంలో పాలకవర్గం సభ్యులు ఈ మేరకు తీర్మానం చేశారు. దీంతో సోమవారం నేరేడుచెర్ల, బూరుగుల, కొలుపల్లి, వంకమెట్టుపల్లి, కొమ్మేమర్రి, సిద్దనగట్టు, రాచర్ల, బోంచెర్వుపల్లి, సీతమ్మతండా, లక్ష్మీతండా తదితర గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు నేరేడుచెర్ల సచివాలయం వద్ద సమావేశమయ్యారు. సర్పంచ్ అనిల్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్యాంరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు రైతులు మాట్లాడారు. గ్రామస్తులు బ్యాంకుకు 25 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉండేదని, స్థానికంగా బ్యాంకు ఏర్పాటు కానుండటంతో ఇబ్బందులు తప్పనున్నాయన్నారు. కేడీసీసీ బ్యాంకు శాఖను ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో పవన్ కుమార్ రెడ్డి, తులసిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షిప్తం

పనితీరును మెరుగు పరచుకోవాలి

అవుకు: మండల పరిధిలోని వీఓఏలు పనితీరును మెరుగుపరచుకోవాలని ఏపీఎం విజయగోపాల్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ముందుగా మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య రికార్డులను పరిశీలించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా పొదుపు మహిళలకు అందుబాటులో ఉండి వారికి అన్ని విధాల సహకరించాలన్నారు. అలాగే పొదుపు సంఘాలకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు జయమ్మ, మద్దిలేటి, బీమేష్, అకౌంటెంట్ ఓబులేసు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో సోమవారం పేకాట ఆడుతున్న వారిని సెబ్ సీఐ బాషా ఆదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా.. గుంజలపాడు రోడ్ వెళ్లేదారిలో పొలాలలో ఐదుగురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడుల్లో పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకొని సంజామల పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆర్‌బీకేల్లో 572 మెట్రిక్ టన్నుల ఎరువులు

బనగానపల్లె: మండలంలోని ఆర్‌బీకేల్లో 572 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో యూరియా 215 మెట్రిక్ టన్నులు, డీఏపీ 231 కాంప్లెక్స్ 126 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి వివిధ పంటలను రైతులు సాగు చేశారన్నారు. అవసరం ఉన్న రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి ఎరువులను పొందాలని ఆయన కోరారు.

బీమా తక్షణ సాయం అందజేత

బనగానపల్లె: పట్టణంలోని ముత్యమియ్య వీధిలో నివాసం ఉంటున్న సయ్యద్ ముంతాజ్‌బేగం సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఈసారి యల్లయ్య, వలంటీర్ చంద్రకళారెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ విజయభాస్కర్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ శాంతిరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు

డోన్ టౌన్: తమకు చెందిన ఇంటి స్థలాన్ని ఆక్రమించి రోడ్డు వేసుకోవాలన్న దురుద్దేశంతో కొంతమంది దౌర్జన్యానికి పాల్పడుతున్నారని శ్రీనివాసనగర్‌కు చెందిన ఉల్లిగడ్డల మారాలీ, జరీనా దంపతులు సోమవారం డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. శంకర్‌గౌడ్, ఉప్పరి ఎల్లయ్యలతో పాటు మరికొంత మంది ఓర్వలేక తమ కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడులు చెయ్యడానికి ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలి

డోన్ టౌన్: మండలంలోని కొత్తబురుజు ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి సోంపి పులిశేఖర్ కోరారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి పరిసరాలను పరిశీలించారు.

రైల్వే స్టేషన్లో భద్రత కరువు

డోన్ టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు భద్రత కరువైందని సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయ భవనంలో సోమవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డోన్ రైల్వే జంక్షన్ కావడంతో నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తున్నా వెళ్తుంటారన్నారు. అయితే రాత్రి వేళల్లో రౌడీ మూకలు ఆగడాలు పెరిగి పోతున్నా పోలీసులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి చర్యలు

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాలను దశలవారీగా ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. సోమవారం మండలపరిధిలోని పాపసానికొట్టాల గ్రామంలో పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. గ్రామంలో పైపులైను వేయడానికి తెచ్చిన రోడ్డు తొలిచే మిషన్‌ను ఎంపీపీ తోపాటు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ రాజశేఖర్ పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్న మద్దమ్మ, గ్రామ నాయకులు ఎద్దులన్న పాల్గొన్నారు.

కోవెలకుంట్ల ఎంఈఓగా వెంకట్రామిరెడ్డి

కోవెలకుంట్ల: మండల విద్యాధికారిగా వెంకట్రామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం యశోద ఇన్‌ఛార్జ్ ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉళ్లగడ్డ ఎంఈఓగా పనిచేస్తున్న వెంకట్రామిరెడ్డిని ఇక్కడ రెగ్యులర్ ఎంఈఓగా నియమిస్తూ విద్యాశాఖ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేయగా ఆయన విధుల్లో చేరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రాజయ్య స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా రాజయ్య బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేస్తున్న యశోద ఎంఈఓగా పదోన్నతి పొంది బండిఆత్మకూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను ఇక్కడ నియమించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: మండల పరిధిలోని దేవరబండ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. కొత్తబురుజు గ్రామానికి చెందిన ఆవన్నపు కృష్ణగిరి మండలం తొగలకొత్తూరుకు చెందిన శివకు ఇచ్చి వివాహం జరిపించారు. కొద్ది రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన భార్యను పిలుచుకొని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా అనంతపురం నుంచి కర్నూలు వైపు వెళ్తున్న వాహనం బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి డోన్ ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండలపరిధిలోని కొలుములపల్లె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ లింగమయ్య తెలిపారు. ఈ దాడుల్లో గ్రామంలోని వస్సూర్ వలి స్వామి దర్గా వద్ద నాటుసారా విక్రయిస్తున్న చాకలి మద్దిలేటి స్వామిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

డోన్ టౌన్: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ఆఖిల్ షఫి అన్నారు. మండల పరిధిలోని యర్రగుంట్ల రైతు భరోసా కేంద్రంలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులకు యజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు నిర్వహించుకొని అందుకు అనుగుణంగా ఎరువులు వాడితే పెట్టుబడులు తగ్గడంతో పాటు మేలైన దిగుబడులను సంతరించుకోవచ్చు అన్నారు. అరవింద్, నాగ సులోచన పాల్గొన్నారు.

పేదల ముంగిటకే సంక్షేమ పథకాలు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తూ పేదల ముంగిటకు సంక్షేమ పథకాలు అందజేస్తూ జనరంజకమైన పాలన అందిస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉద్యా ఆరాధిని సభ్యులు ముర్తుజావలి అన్నారు. సోమవారం పట్టణంలోని దుర్గాపేట, బేగంపేట కాలనీల్లో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, వైస్ చైర్మన్ నాగ వెంకట కృష్ణ, వార్డు కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, మధు, కోట్ల ఉమా ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా పలు సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, శేఖరయ్య, భాస్కర్, నాగరాజు, సంధానిబాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


దుర్గాపేట కాలనీలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎం.పెండేకల్లులో శరవేగంగా అభివృద్ధి పనులు



గ్రామంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్

బేతంచెర్ల: మండలపరిధిలోని ఎం.పెండేకల్లు గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటుకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దాదాపు రూ.35 లక్షల మంజూరయ్యాయి. గ్రామంలో రూ. 22 లక్షలతో 450 మీటర్ల సీసీ రోడ్డు, రూ.13 లక్షలతో 600 మీటర్ల డ్రైనేజీ కాల్వల పనులు చేపట్టారు. అలాగే జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే పనులకు రూ. 29 లక్షలతో కొనసాగుతున్నాయి. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పైపు లైను పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రూ. 17.50 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

బనగానపల్లెరూరల్: విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభను వెలికి తీసేందుకు అధ్యాపకులు కృషి చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతదేవి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఉర్దూ శాఖ ఆధ్వర్యంలో హస్తకళ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన తిలకించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, వాటిని గుర్తించి తోడ్పాటిని సాయపడేలా కృషి చేయాలన్నారు. ప్రతిభను వెలికి తీసేందుకు హస్తకళ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందన్నారు.


హస్తకళాప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతదేవి

ట్యాలీ కోర్సులో శిక్షణ

డోన్ టౌన్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడపలో ట్యాలీ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆపైన చదివి 18 నుంచి 26 సంవత్సరాల వయస్సు లోపల వారు అర్హులన్నారు. 35 రోజుల పాటు కడపలో ఉచిత భోజనం, వసతితో పాటు శిక్షణ ఇచ్చి అనంతరం కనీసం నెలకు రూ.15వేలతో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వివరాలకు సెల్ 90004 87423 నంబర్లో సంప్రదించాలన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంటలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాదరెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీపీ కారపాకుల నాగవేణి హాజరవుతారన్నారు.

సంజామల: మండల పరిధిలోని కమలపురి సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగరమాని తెలిపారు. అర్హత ఉండి అందా ప్రభుత్వ పథకాలు అందనివారు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులో మార్పు తదితర 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కోవెలకుంట్ల: గర్భిణులు ఆరోగ్యసూత్రాలు పాటించాలని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. సోమవారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు గర్భందాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు ప్రతి నెల డాక్టర్లను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మాతా, శిశు మరణాల రేటును తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, తదితర పౌష్టికాహారం తీసుకోవడం తల్లి, బిడ్డకు శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, స్టాఫ్‌నర్స్ మేరీ, ల్యాబ్ టెక్నీషియన్ జయలక్ష్మి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విద్యాసాగర్

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి

అవుకు: గర్భందాల్చిన ప్రతి మహిళ తప్పకుండా వైద్యుల సూచనలు పాటించాలని డాక్టర్లు యమున, రవికుమార్, ప్రశాంతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ గర్భందాల్చిన వెంటనే గర్భిణులు వారి పేర్లను ఆరోగ్య కార్యకర్తల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని 85 మంది గర్భిణులకు రక్త పరీక్షలు, స్కానింగ్ చేసి 19 మందిని ప్రమాదకర గర్భవతులుగా గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిరా కల్యాణి, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, మల్లేశ్వరి, దానమ్మ, తెరిసమ్మ, సిహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్ వరకు రూ.630 కోట్లతో 56 కిలోమీటర్ల మేర చేపట్టే ఎన్‌హెచ్ 340బీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, డీటీ సత్యవీర్ ఆధ్వర్యంలో ఆర్ కొత్తపల్లె, ఆర్.ఎస్ రంగాపురం, కొలుములపల్లె, సిమెంట్‌నగర్, బుగ్గానిపల్లె గ్రామాల్లో ఎన్‌హెచ్ 340(బీ) కింద భూములు కోల్పోతున్న రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఆర్ కొత్తపల్లెలో 4.64 ఎకరాలు, ఆర్ ఎస్ రంగాపురం 6.51, కొలుములపల్లె 11.95 ఎకరాలు, బేతంచెర్ల –35.80, బుగ్గానిపల్లె –26.75 ఎకరాలు రహదారి నిర్మాణానికి సంబంధించి 279 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు జాబితాను రూపొందించామన్నారు. గ్రామాల వారీగా ఉన్న భూముల విలువల ఆధారంగా రైతుల అభిప్రాయాలు తీసుకోవడం జరిగిందన్నారు. బేతంచెర్ల మండలంలో రహదారి నిర్మాణంలో పోతున్న భూమి 83 సెంట్లు, పట్టా భూమి 83.14 ఎకరాలు, ప్రభుత్వ భూమి 31.74 ఎకరాలు ఉందన్నారు.


మాట్లాడుతున్న డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి

నష్టపరిహారానికి ప్రతిపాదనలు

1956 జాతీయ రహదారుల చట్టం ప్రకారం రైతులకు నష్ట పరిహారం చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ వెల్లడించారు. ఆర్ కొత్తపల్లె గ్రామంలో ఎకరాకు రూ. 8లక్షల పైన, కొలుములపల్లె గ్రామంలో వ్యవసాయ భూమి ఎకరాకు రూ. 5లక్షలు, రహదారి పక్కన రూ.7.50 లక్షలు, బేతంచెర్లలో వ్యవసాయ భూమి రూ. 9లక్షలు, రోడ్డు పక్కన రూ.12 లక్షలు ఇవ్వేందుకు ఆర్డీఓ ప్రతిపాదించారు. దీనిపై రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జ్యోత్స్న, ఆర్‌ఐ శ్రీదేవి, వీఆర్వోలు రఫీ పాల్గొన్నారు.